క్లుప్తంగా

ఇస్రో సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు శుక్రవారం ఇస్రో సందర్శనకు వెళ్లారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలోని ఇస్రో(ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్), ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)ను నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో (కేఎండీసీ) డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనకు వెళ్లినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ రమణారావు తదితరులు పాల్గొన్నారు. ఇండస్ట్రియల్ టూర్ విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు డీఆర్‌ఎస్ కళాశాల యాజమాన్యం వి.మోహన్‌రెడ్డి, శోభారెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావులు, ఏఓ వెంకటకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని 33 కేవీ సబ్ స్టేషన్ 11 కేవీ వీడీవోస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు టౌన్–3 ఏఈ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడీవోస్ కాలనీ ఫీడర్ పరిధిలోని గట్టయ్య సెంటర్, వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కావ్యచంద్‌కు ప్రశంస



ప్రశంసాపత్రాన్ని చూపిస్తున్న కావ్యచంద్

ఖమ్మంవైద్యవిభాగం: మహిళా ఫిజీషియన్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కావ్యచంద్ యాలముడికి లీసెస్టర్ డయాబెటిస్ ఇనిస్టిట్యూట్ (లీసెస్టర్ –వీకే) ప్రశంసాపత్రం లభించింది. డయాబెటిస్, హెచ్‌బీఏ1సీపై నిర్వహించిన పరిశోధనకు గాను ఆమెకు ప్రశంసాపత్రం లభించింది. శుక్రవారం కావ్య ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌ రవీందర్ యాలముడి, ప్రసూన పారుపల్లి వివరాలు వెల్లడించారు.

బ్రహ్మోత్సవాలకు సుర్దేపల్లి వాసికి ఆహ్వానం

నేలకొండపల్లి: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు మండలంలోని సుర్దేపల్లికి చెందిన రచయిత దూత రామకోటేశ్వరరావుకి శుక్రవారం ఆహ్వానం అందింది. ఏపీలోని తిరుపతి జిల్లా మహతి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 తేదీల్లో ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తుందని.. కార్మికుల వేతనాలు వెంటనే ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రాందాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇఫ్టూ ఆధ్వర్యాన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికుల సమస్యలపై ఎంపీడీఓ జయరాంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేతనాలు చెల్లించకపోతే ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

శిలువతో సాగింది యాత్ర ..



పాదయాత్రగా వస్తున్న క్రైస్తవులు

రఘునాథపాలెం: గుడ్ ఫ్రైడే (ఈస్టర్) పండుగను స్మరించుకుంటూ మండలంలోని బూడిదంపాడు విచారణ కథోలిక క్రైస్తవ సంఘం ఆధ్వర్యాన శుక్రవారం బూడిదంపాడు గ్రామం నుంచి ఖమ్మం కరుణగిరి పుణ్యక్షేత్రం వరకు క్రైస్తవ సోదరులు శిలువను మోస్తూ పాదయాత్ర చేశారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ దామాల సురేష్ ఆధ్వర్యంలో బూడిదంపాడు నుంచి ఖమ్మం కరుణగిరికి చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం, దసరా
సాయిరాం	బోళా
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కీ
సుందర్	రంగ మార్తాండ

- ఖమ్మంవ్యవసాయం

ప్లాస్టిక్ భూతం..!



ప్లాస్టిక్ కవర్లను తీసుకెళ్తున్న వినియోగదారులు

అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు

- వద్దంటూనే యథేచ్ఛగా వినియోగం
- ప్రత్యామ్నాయం సమృద్ధిగా లేకనే ప్రజల వాడకం
- నిబంధనలు పట్టని దుకాణాదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్లాస్టిక్ వినియోగంతో మానవ మనగడకు ముప్పు పొంచి ఉంది. పర్యావరణ హితానికి ప్రభుత్వం ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం విధించినా.. ఎక్కడా అమలు కావటం లేదు. వ్యాపారులు, ప్రజలు, యథేచ్ఛగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నా.. అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా.. వినియోగించక తప్పడం లేదు. ప్రత్యామ్నాయ వనరులు సమృద్ధిగా లేనందున్న ఈ మహమ్మారితో సహవాసం చేయాల్సి వస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తమవుతోంది. భూమిలో కరగని ఈ ఉత్పత్తులను నిషేధించి, క్రమ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తే కచ్చితంగా మార్పు వస్తుందని ఆలోచన అందరిలో నెలకొంది.



దుకాణం వద్ద సామాజిక కార్యకర్తల ప్రచారం (ఫైల్)

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్లు, కాలనీల్లో ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలు కుప్పలు.. తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ప్రజలు ప్లాస్టిక్ సంచులను విరివిగా వాడుతున్నారు. ఏ దుకాణం వద్ద చూసినా కూరగాయలు, నిత్యావసరాలు అంటూ ఒకటేమిటి ఇలా ప్రతీ వస్తువుకు ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ పలు దుకాణాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించటం పరిపాటిగా మారింది. దీంతో పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

ఇలా చేస్తే సత్ఫలితాలు..

- ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు అవగాహన కల్పించే కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.
- ప్లాస్టిక్, పాలిథిన్ ఉత్పత్తులను నిల్వ చేసినా.. రవాణా చేసినా.. భారీ జరిమానాలు విధించాలి. వాటిని తయారు చేసే సంస్థల లైసెన్సులను రద్దు చేయాలి.
- ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను మహిళా సంఘాలు, యువజన సంఘాలతో కలిసి గ్రామాలు, వార్డుల వారీగా అవగాహన కల్పించాలి.
- వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి నిషేధం సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలి. సహకారం అందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలి.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం..



గతంలో చాలా వరకు నియంత్రించగలిగాం. కానీ మళ్లీ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. మరోమారు దుకాణ యాజమానులకు సమాచారం ఇచ్చి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రచారం మరింతగా చేపడతాం.

– కె.నాగమణి, సామాజిక కార్యకర్త, గువ్వలగూడెం

చర్యలు తీసుకోవాలి..



ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా అమలయ్యేలా అధికారులు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి. అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. లేదంటే భవిష్యత్‌లో మానవ మనగడకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. నిషేధంపై అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలి.

– బచ్చలకూరి నాగరాజు, కోరట్లగూడెం

అందరిలో చైతన్యం రావాలి..



ప్రకృతిని దెబ్బతీస్తు మానవ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. చివరకు కవర్లను కాల్చిన వాతావరణం విషపూరితంగా మారి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని గుర్తించాలి.

– కె.రాజేష్, వైద్యాధికారి, సీహెచ్‌సీ, నేలకొండపల్లి

పౌర హక్కులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఖమ్మంమయూరిసెంటర్/కామేపల్లి(కారేపల్లి)/ తిరుమలాయపాలెం: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి, తిరుమలాయపాలెం తహసీల్దార్లు కోట రవికుమార్, పుల్లయ్య, 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం కామేపల్లి మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామంలో షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, ఖమ్మం నగరంలోని 36వ డివిజన్‌లో, తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో పౌర హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎవరైనా పౌర హక్కులకు భంగం కలిగిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్‌ఎస్‌ఐ సీహెచ్.రమేష్, సాంఘిక సంక్షేమ శాఖ హెచ్‌డబ్ల్యూఓ కె.రుక్మరావు, కామేపల్లిలో ఎంపీడీఓ గుప్తా, తిరుమలాయపాలెంలో ఎంపీడీఓ జయరాం, ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్ గంటా నిర్మాల, ఎంపీటీసీ అంబేడ్కర్‌తో పాటు సిరిగద్దె ఉపేదర్, సైపుద్దీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కండి

నేలకొండపల్లి: పంచాయతీ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్ కోరారు. పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో చేయనున్న పలు పనులపై సభ్యులు చర్చించారు. పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. వార్డుల వారీగా పంచాయతీని అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు వారి సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, ఎంపీటీసీ బొందయ్య, వార్డు సభ్యులు పీ.వీ.నాగిరెడ్డి, కొండా కనకప్రసాద్, గొలుసు రవి, మానస, బేబి, మేట్టేల నరేష్, వరలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్: పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేరులో షర్మిల గెలుపుకు గ్రామాల్లో కమిటీలు వేసి ఇంటింటా తిరిగి వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో కొత్త ఓటర్లను చేర్పించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సైదులు, చిన్న వెంకటరెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు యడ్లపల్లి వెంకయ్య, టి.వెంకటేశ్వర్లు, బత్తిని వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ సభ్యత్వం

ఖమ్మంఅర్బన్: ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని కాసాని జ్ఞానేశ్వర్, పార్లమెంట్ అబ్జర్వర్ కూరపాటి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నగర కో ఆర్డినేటర్ వడ్డె విజయ్ ఆధ్వర్యాన నగరంలోని పాండురంగాపురం నాలుగో డివిజన్‌లో సభ్యత్వ నమోదు చేస్తూ కరపత్రాలు పంచారు. వారి వెంట డివిజన్ కో ఆర్డినేటర్ హరి, మహిళా నాయకురాలు శౌలం లావణ్య, నిర్మల, జిల్లా నాయకులు గుత్తా సీతయ్య, ఖమ్మం నగర నాయకులు ప్యారిస్ వెంకన్న, గుడిపూడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కేవీ భవన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మేయర్, చైర్‌పర్సన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద భారతీయ రాష్ట్ర సమితీ(బీఆర్‌ఎస్) కార్మిక విభాగం ట్రాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నున్నా మాధవ రావు ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన కార్మిక భవనాన్ని శుక్రవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. అనంతరం నున్నా మాధవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో త్వరలో రూ. 10.34 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయని, జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, గీతా వెంకన్న, మాటేటి నాగేశ్వరరావు, కనకం భద్రయ్య, ట్రాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల శ్రీనివాస్ రావు, సాదె శంకర్, కొత్త సైదిరెడ్డి, మరాఠి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



ఖమ్మంఅర్బన్: గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: నగరంలోని 5వ డివిజన్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లె బోయిన భారతిచంద్రయ్య గర్భిణులకు చీర, సారె అందించారు. బల్లేపల్లి సెక్టార్ పరిధిలోని కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు 25 కుర్చీలను వితరణగా దాతలు బోల్లెద్దుల జ్యోతి విజయ్, జక్కుల అనూష రమేష్ దంపతులు అందించారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలం బాలాజీనగర్‌తండా పరిధిలోని బీసురాజుపల్లితండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎదుళ్లచెరువు, రమణాతండా అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రాధ, నాగమణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం నూతన కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి మోసం మోసిందని, దీనివల్ల మాదిగలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, అంజయ్య, ఏపురి వెంకటేశ్వరావు, సునిల్, అశోక్, వంగూరి ఆనందరావు, రాము, శ్రీను, నాగభూషణం, వీరస్వామి, ఉపేంద్ర, నాగరాజు,వెంకన్న పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యకు పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల వద్ద ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణంతో పాటు శోభాయాత్ర, లకారంలో తెప్పోత్సవం నిర్వహించిన విషయం విదితమే. కాగా, శుక్రవారం శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం పర్ణశాల ఆలయం వద్ద భక్తుల సమక్షంలో అర్చకులు పవన్‌కుమార్, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చావా నారాయణ రావు, ఈఓ కాముని శ్రీకాంత్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రవి, వల్లెబోయిన రవి, కుతుంబాక వుల్లయ్య, బసవయ్య, స్వర్ణ నాగేశ్వరరావు, కిలారి రాజేశ్వరరావు, కేసా సత్యనారాయణ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన సత్యాగ్రహ దీక్ష..



దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కూసుమంచి: మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అప్రజాస్వామికంగా పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయటాన్ని నిరసిస్తూ శుక్రవారం కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ దీక్షలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, నాయకులు ఎండీ హఫీజుద్దీన్, రామసహాయం మాధవీరెడ్డి, బాణోత్ వినోద, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వాసుదేవరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేలకొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గత 23 ఏళ్లుగా సబార్డినేట్‌గా దానావత్ వాసుదేవరావు అందించిన సేవలు ప్రశంసనీయమని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పదవీ విరమణ సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి..

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్లు గ్రామంలో ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు నువ్వుల కాంతమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. కాంతమ్మ మృతదేహాన్ని జిల్లా సీపీఎం కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి అనంతని వీరయ్య, చెరుకూరి మురళి, హనుమంతు శేషగిరి, నువ్వుల కృష్ణయ్య, గండు లక్ష్మీనారాయణ, చెరుకూరి వెంకటనరసయ్య, సర్పంచ్ మేదరమెట్ల వెంకటరమణ, ఉపసర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

మండలంలోని కామంచికల్‌కు చెందిన తొండల రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందగా.. పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సర్పంచ్ మేదరమెట్ల వెంకటరమణ, తదితరులు నివాళులర్పించారు.

సీఐటీయూ నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలపై అదనపు భారం మోపే నూతన రవాణా చట్టం–2019ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రం, జిల్లా కార్యదర్శి ఉపేందర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో శుక్రవారం నూతన రవాణా చట్టంకు నిరసనగా నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. 2023 ఏప్రిల్ 5న చలో ఢిల్లీ మజ్దూర్ కిషన్ సంఘర్ష ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ రాందాస్, జిల్లా కోశాధికారి దండగల ఉపేందర్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు శ్రీను, యాసీన్, అక్బర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నవీన్ రెడ్డి, నాయకులు కంపాటి వెంకన్న, వెంకన్న బాబు, మాచర్ల గోపాల్, పుల్లయ్య, డ్రైవర్లు రమేష్, శీను, నాగేశ్వరావు, ఖాసిం పాల్గొన్నారు.

పెంచిన చార్జీలు ఉపసంహరించుకోవాలి

ఔషధాల ధరలు 12 శాతం, టోల్ గేట్ల వద్ద వసూలు చేసే చార్జీలు 5.5% పెంచటాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్యులపై భారాలు మోపి, సంపన్నులకు రాయితీలు యిచ్చి, సంపద దోచి పెట్టే చర్యలు బీజేపీ ప్రభుత్వం మానుకోవాలన్నారు.

2న సమావేశం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 2న(ఆదివారం) జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బిక్కు, కె.వి.రమణ తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, ఖమ్మం నగర శాఖ కార్యదర్శులు, నాల్గో తరగతి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిన్నారికి బోన్ మ్యారో చికిత్స విజయవంతం



బాలుడుకి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: గత ఐదేళ్లుగా తలసేమియాతో బాధపడుతున్న మతంపల్లి మండలం భీల్యానాయక్ తండాకు చెందిన చిన్నారి బానోత్ దిలీప్ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బెంగళూర్‌లో ఇటీవల రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల ఖర్చుతో కూడిన బోన్‌మ్యారో చికిత్సను అతి తక్కువ ఖర్చుతో చేయించగా.. శుక్రవారం తిరిగి ఖమ్మం చేరుకున్నాడు. దీంతో చిన్నారికి సంస్థ బాధ్యులు, వైద్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డే కేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వైద్యులు మాట్లాడుతూ.. చికిత్స విజయవంతమైన వారికి ప్రతీ 20 రోజులకు రక్తం ఎక్కించుకునే అవసరం లేదని తెలిపారు. చికిత్స పొందిన చిన్నారి ఆరోగ్యం పట్ల మరో 10 నెలలు జాగ్రత్తగా ఉండాలని, బయట వ్యక్తులను కలవకుండా ఇంట్లోనే ఉండాలని సూచించారు. సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్ మాట్లాడుతూ.. చిన్నారి వైద్యఖర్చులకు తమ సంస్థతో పాటు మరికొంత మంది దాతలు ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.రమేష్ బాబు, డి.నారాయణమూర్తి, లక్ష్మణ్ సింగ్, జితేందర్, కుమార్, సంస్థ ఉపాధ్యక్షులు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎస్. ఉపేందర్ ఉన్నారు.

‘పది’ విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు

దాతల సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు వితరణ



వెలుగుమట్ల పాఠశాలలో.. అందించిన ప్యాడ్లను చూపిస్తున్న విద్యార్థులు

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు వితరణగా అందించారు. వెలుగుమట్ల పాఠశాలలో చేతన ఫౌండేషన్ వారు పరీక్ష సామగ్రి, విజయభారతి జామెట్రీ బాక్సులు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, దస్తగిరి, హెచ్‌ఎం శైలజ తదితరులు పాల్గొన్నారు. అలాగే వీవీ పాలెంలో తానా ఫౌండేషన్ వారు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేపకుంట్ల పాఠశాలలో వీడ్కోలు సంబరాలు హెచ్‌ఎం నారాయణ ఆధ్వర్యంలో, కొత్తగూడెం జెడ్పీ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.అనంతరం పూర్వ విద్యార్థి రావుల సంజీవరావు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ వలరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ గూటి శ్రీనివాసరావు, నాయకులు పగడాల మల్లేష్, రసూల్ పాల్గొన్నారు.